# జీవితరంగం



## – స్వరాజ్య పద్మజ కుందుర్తి

వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి  దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో  కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## సొంత వ్యవసాయం

"అమ్మమ్మా! మీ సవతి సోదరుడు  అంతగా ఇబ్బంది పెట్టాడా మిమ్మల్ని. అప్పుడు ఎవరూ ఏమీ అనలేదా ఆ తాతయ్యని?" అన్నాను.

" ఎవరికీ ఏమీ అనే ధైర్యం లేదే తల్లీ! ఎందుకంటే అనువంశికంగా మా నాయన కరిణీకం వాడికి వచ్చిందిగా...ఆ రోజుల్లో పల్లెటూళ్ళలో కరణాలకు చాలా భయపడేవారు జనం. ఊరికరణం ఎంతచెబితే అంత. అలావినకపోతే రేపు వాళ్ళపొలాలకు ఏమన్నా ఇబ్బందులు తెస్తాడేమోనన్న భయం. ఊరిపెద్దల్లో కొందరికి కరణం గారి ప్రాపకం సంపాదించలన్న ఆత్రం. ఏమయితేనేం ఒక్కరుకూడా మావైపు మాట్లాడలేదు.

" ఇంకా విచిత్రం ఏంటంటే అప్పటిదాకా నాన్నది స్వంత వ్యవసాయమే! మా పొలం కౌలుకి  తీసుకోవటానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు. కాసిని సొమ్ములూ మూటకట్టుకుని, పొలం పత్రాలు చేతపట్టుకుని ఇల్లువిడిచి గుంటూరు చేరాం. పెద్దమ్మమ్మ బావగారైన దేచిరాజు  సాంబశివరావు గారింటికి.

" చెప్పాలంటే అదోపెద్ద సంస్థానమే తల్లీ! ఎప్పుడూ వచ్చిపోయే అతిధులతోనూ, గుంటూరులో కోర్టులో పనుండి ఆ తాతగారికోసం వచ్చే జనాలతోనూ, ముఖ్యంగా అవి స్వాతంత్ర సంగ్రామం జరిగే రోజులు కనుక చాలామంది స్వాతంత్రోద్యమ నాయకులతోనూ చాలా సందడిగా ఉండేదాయిల్లు.

కొంత కాలం ఆ పంచన తలదాచుకుందామని వచ్చామే గానీ, ఆయిల్లు మాకో విద్యాలయమూ, దేవాలయమూ, అయ్యిందనుకో. అందరమూ కలిసి వంటావార్పూ చెసుకోవటమూ, మధ్యాహ్నం దేశభక్తి గేయాలు నేర్చుకోవటమూ చేసేవాళ్ళం. అప్పటిదాకా మాకు స్వాతంత్రోద్యమం మీద పెద్దగా అవగాహనలేదు. కానీ గుంటూరు చేరిన తరువాత మా ఆలోచనా విధానమే మారిపోయింది.

రెండు నెలల కాలం ఎలా గడిచిపోయిందో తెలియదు. మళ్ళీ పంటల రోజులు రావటం తో మావూరికి తిరిగి వెళ్ళాం. తిరిగివచ్చిన మమ్మల్ని చూసి, ఊరంతా ఎలాఉన్నారమ్మా... అంటూ పలకరించటానికి వచ్చింది.

మా తమ్ముడు మాత్రం ఇంటికొచ్చిన ఆడపిల్లలను పలకరించలేదు సరికదా ...కనీసం మా ఒదినను మాకోసం వంటచేయొద్దని మా మొఖాన్నే చెప్పి కచేరీ చావడికి వెళ్ళాడు. మా వదిన కూడా మొఖం చాటు చేసుకుంది.

మాకు చాలా అవమానం గానూ, దిగులుగానూ అనిపించింది. అక్కయ్యమాత్రం ధైర్యం గా నిలబడి "ఇది మన ఇల్లు కూడానూ, వీడి అబ్బసొమ్మేమీ కాదు. మన ఇంట్లో మనం ఉండటానికి వీడి అనుమతితో మనకు పనిలేదే చిట్టెమ్మా ..."అంటూ పురిలోనించి మానెడు వడ్లు తీసి దంచుకుందాం రమ్మని పిలిచింది ఇద్దరమూ వడ్లు దంచుకుని, నేను చెరిగేలోగా తను భావిదగ్గర స్నానం చేసి కుంపట్లో అన్నం వండింది.

ఆచారి గారి భార్య "ఇదేం సోద్యమమ్మా! ఇంటికొచ్చిన ఆడపిల్లల్ని పస్తుపెడతాడా ...వీడికి పుట్టగతులుంటాయా "అని తిట్టిపోసి,సోలెడు కందిపప్పూ కాసిని దోసఒరుగులూ తెచ్చిచ్చింది. వాటితో పప్పుచేసి ఆపూటకు ఇద్దరం తిన్నామనిపించాం.భార్యాభర్తలిద్దరూ అసలు మేమిద్దరం ఇంట్లో లేనట్లే ప్రవర్తించారు.

ఆరాత్రి కెలాగో పంచలో గడిపి, తెల్లారి మోతుబరి రైతులనీ, ఊరి పెద్దమనుషులనీ పిలిచి పంచాయతి పెట్టింది అక్కయ్య. పొలమూ సొమ్ములూ తిరిగి ఇవ్వాల్సిందేననీ, తిరిగి ఇస్తేనే తనింట్లో ఉండనిస్తాననీ తెగేసి చెప్పాడు వాడు. సర్దిచెప్పబోయిన పెద్దమనుషులని నానామాటలూ అన్నాడు. వాడినోటికి దడిచి ఎవ్వరూ ఒక్క మాట కూడామాట్లాడలేక పోయారు.

అక్కయ్య మాత్రం ఇల్లు మాత్రం మాదేననీ కనీసం ఇంట్లో సగభాగమైనా ఇవ్వాల్సిందేననీ పట్టుపట్టింది. అందుకు వాడు ఒప్పుకోలేదు వారసుడిగా ఇల్లు తనదేనని పట్టుబట్టాడు. చివరికి పెద్దమనుషులు వాడిని ఒప్పించి చొప్పదొడ్డైనా మాకు ఇవ్వమని చెప్పటం తో అయిష్టంగానే అదిమాకు రాసిచ్చాడు.

"చొప్పదొడ్డా? అదంటే ఏమిటి అమ్మమ్మా! అది ఇంట్లో వెనక ఉండే పెరడా? " అడిగాను అమ్మమ్మని.

" చొప్పదొడ్డి అంటే ఇంటికి దూరం గా పశువులకోసం గడ్డివామి వేసుకునే స్థలం. అక్కడే పసువులు వేసిన పేడా, ఇతరవ్యర్ధాలూ వేసే దిబ్బలూ ఉంటాయి. అంతేకాక వంటచెరకు కూడా అక్కడే నిలవ చేస్తారు దాన్నే చొప్పదొడ్డి అంటారు." చెప్పింది అమ్మమ్మ.

" వంటచెరుకంటే తినే చెరుకా?" అడిగాను అమ్మమ్మని ....

"వంటచెరుకంటే వంటచేసుకోవటానికి పొయ్యిలోకి వాడే తుమ్మ, వేగిస,మద్దిలాంటి కట్టెలూ, ఇంకా కందికట్టెలూ, పత్తి కట్టెలూ ఇలాంటి చిన్న ఎండిన చెట్లన్నీ మోపులుగా కట్టి నిలవ ఉంచే ఉంచేవారు. అప్పట్లో వీటితోనే పొయ్యిలమీద వంటలు చేసేవారు. అందుకేవీటిని వంటచెరుకంటారు" చెప్పింది అమ్మమ్మ.

"ఊరి వాళ్ళ సహాయంతో చొప్పదొడ్డి అంతా శుభ్రం చేసాము. రెండు పుట్టలు ఉంటే తవ్వించేసాము. ఒకపాముకూడా తిరుగుతుంటే, దాన్ని పట్టించి ఊరవతల తుప్పల్లోకి వదిలిపెట్టించాము. ముందుగా ఒకపక్కగా రెల్లుతో పూరిల్లు కట్టించుకున్నాం. దాంట్లో ఉంటూ పెంకు వసారా కట్టించుకున్నాం. ఈ లోగా పొలాలు కౌలుకు ఇవ్వాలని మా ఆలోచన. కానీ మా తమ్ముడు మాత్రం మేము అక్కడే ఉంటామన్న విషయం భరించలేక పోయాడు.

అక్కచెల్లెళ్ళు ఇద్దరం అలా ఆవూర్లోనే ఇల్లు కట్టుకోవడం వాడికి సుతరామూ నచ్చలేదు. పైగా ఊరిలోని అమ్మలక్కలు మాపై సానుభూతి కురిపించటం, పెద్దగా డబ్బు ఆశించకుండా మాకు ఇల్లుకట్టుకోవటంలో అందరూ సహాయం చేయడం వాడికి చాలా అసూయ కలిగించింది. ఎవ్వరినీ మా పొలాలు కౌలుకు తీసుకోవద్దనీ, అలా తీసుకుంటే తనతో వైరం పెట్టుకున్నట్టేననీ బెదిరించాడు. దాంతో పొలం కౌలు చెయ్యడానికి ఎవరూ ముందుకు రాలేదు.

అక్కయ్య చాలా బాధపడింది. మరో మార్గం ఆలోచించి మేమే సొంతగా ఒక పదెకరాల్లోనన్నా వ్యవసాయం చెయ్యలనుకున్నాం. ముందుగా చెరువుకిందున్న మూడెకరాల్లో వరి పంట వేయాలని, మిగిలిన వర్షాధారమైన మెట్ట చేలల్లో సజ్జ, జొన్న, రాగుల్లాంటి పంటలు వేయాలనుకున్నాం. అప్పట్లో వరినారు ఎవరికి వారే చేలో ఒక మడిలో వేసుకునేవారు. ఇంటినిండా ధాన్యపు గాదెలున్నా మా తమ్ముడు ఒక బస్తా వరిధాన్యం కూడా ఇవ్వటానికి ఇష్ట పడలేదు.

అక్కయ్య పదిమైళ్ళ దూరం లోని కనపర్తి నడిచివెళ్ళి, అక్కడ రెండు మూడు బస్తాల ధాన్యం కొని, మూడవరోజుకు బండికట్టించుకుని ఇల్లుచేరింది. అప్పటిదాకా రెండు నెలలు మాయిద్దరికీ తమ్ముడికి తెలియకుండా ఊరివాళ్ళు తమ కున్నధాన్యమేదో జొన్నలో, సజ్జలో, బియ్యమో ఏదోవొకటి ఇస్తూ మా ప్రాణాలు కాపాడారు. మేముకూడా వాళ్ళిచ్చినదే మహాప్రసాదం గా భావించి తిని రోజులు గడుపుకున్నాం.

నేను ఎప్పుడైనా బాధపడి " ఎందుకీ కష్టాలు అక్కయ్యా .... ఉన్నదేదో వాడిమొహాన్న కొడితే అంత ముద్దపెట్టకపోతాడా ..." అనేదాన్ని. " అప్పుడు మనబతుకు ఇంకా దుర్భరమౌతుందే తల్లీ --- బండెడు చాకిరీ చేసి పస్తులుకూడా ఉండాల్సొస్తుంది. ఒకసారి వాడిచేతిలో పడ్డామంటే --- ఇక ఆ నరకం నుండి ఈ జన్మకు బైట పడలేం. మనకెవ్వరూ లేరే అమ్మా !! నాకునువ్వూ, నీకునేనూ .... నువ్వు ధైర్యం కోల్పోయి, నన్నూ పిరికిదాన్ని చెయ్యకు. రాజకుమారులైన పాండవులంతటి వాళ్ళకే కష్టాలు తప్పలేదే తల్లీ! మనమనంగా ఎంత --- ఎలాగోలా ఈయేడు పంట పండించుకున్నామంటే, కావలసినంత ధాన్యం. మనరోజులు వెళ్ళిపోతాయ్" అని ఓదార్చేది అక్కయ్య.

వ్యవసాయానికి కావలసిన డబ్బు గుంటూరునుంచి సాయం అందింది. కానీ, చేలో నిలబడి దున్నటానికి ఎవరూ సాయం రాలేదు. ఊర్లో మోతుబరి రాఘవయ్య దగ్గరికి వెళితే " మీ తమ్ముడు అసాధ్యుడు నేను సాయం చేస్తున్నానని తెలిస్తే ఊరుకోడు. మా వ్యవసాయం పనులకు ఎద్దులున్నాయి. రెండు దున్నపోతులు మీకిస్తాను ఎవరినన్న పెట్టి దున్నించుకోండి." అని రెండు దున్నపోతులతో పాటు, ఒక చూడి బఱ్ఱెను కూడా తోలి పెట్టాడు.

" చూడి బఱ్ఱె అంటే?" అడిగాను.

" అంటే కడుపుతో ఉన్న బఱ్ఱె అది ఈనితే పిల్లపుడుతుంది. దానితోబాటు మనకు పాలుకూడా దొరుకుతాయి. అటువంటి క్లిష్టమైన పరిస్థితుల్లో అంతమాత్రం సాయం చేసిన ఆ రాఘవన్నయ్యను ఎప్పటికీ మర్చిపోలేమమ్మా...." అంది అమ్మమ్మ కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా.

ఆ తరువాత పొలం దున్నటానికి కూడా ఎవరూ ముందుకురాని పరిస్థితుల్లో, మాదిగ సుబ్బడు ముందుకొచ్చాడు. " అమ్మానేను దున్నిపెడతాను పొలం అంటూ .." అప్పుడు వాడు దేవుళ్ళాగా కనిపించాడు మా కళ్ళకు. ఒక మడిలో నారుపోసి తరువాత మిగిలిన పొలం

దున్నాడు. నెలలో నాట్లు పడ్డాయి. పైరు పెరుగుతున్న దశలో చెరువునుంచి నీరు ఇవ్వనంటూ మా తమ్ముడు అడ్డం పడ్డాడు. తన పొలం మీదుగా వచ్చే నీళ్ళను దారి మరల్చి మాకన్న కిందనున్న ఇంకొకరికి నీళ్ళివ్వటం మొదలు పెట్టాడు.

ఎండిపోతున్న పొలం చూసి ఇద్దరం ఏడ్చుకునేవాళ్ళం అంతకన్నా ఇంకేం చేయలేని నిస్సహాయత .... అప్పుడుకూడా మాదిగ సుబ్బడే మా పాలి దేవుడయ్యాడు. " అయ్యో!! తల్లుల్లారా!! ఇంత అన్యాయమా ... నేనూ సూత్తాను ఆయనగారి సంగతేందో ..." అనుకుంటూ వెళ్ళి, రాత్రి బాగా కల్లుతాగి పొలాన పడి కాలువను మా పొలానికి మలిపి తెల్లారే సరికి పొలం తడిపి, యధాతథం గా కాలువని పూడ్చి వెనక్కొచ్చేవాడు.

ఇలా అయిదారు సార్లు జరిగినాక కానీ మా తమ్ముడికి విషయం తెలియలేదు. ఈలో గా పొలం పొట్టకొచ్చి రంగు మారింది. ఇంక నీళ్ళు లేకపోయినా ఇబ్బందిలేదు. ఆరకంగా ఇబ్బందిపడి పంట కోతకొచ్చాక ధాన్యం కోయించి మధ్యాహ్నానికి ఇంటికొచ్చింది అక్కయ్య. ఓదెలమీద ఉన్న పంట .... ఎకరానికి పదిబస్తాలు పండితే ఆరోజుల్లో ఎక్కువ కానీ పదిహేను బస్తాలదాకా రాలేటట్లు కనపడింది. మాకోసం కష్టపడ్డ మాదిగ సుబ్బడికి కొంత ఇవ్వలనుకున్నాం. అన్ని ఖర్చులూ పోను మూడెకరాలకీ ముప్పై బస్తాల ధాన్యం మిగులుతుందనుకున్నాం.

"ఓదెలంటే ఏంటీ?" అడిగాను అమ్మమ్మని.

" ఓదెలంటే పొలాల్లో వరి కోసాక, ఆ ధాన్యం కంకులతో ఉన్న మొక్కల్ని అలాగే "పనలు" అంటే మన ఒక చేత్తో గుప్పిటతో వరిమొక్కలు పట్టుకుని కొడవలితో కోస్తారుగదా ...అలాంటివి గుప్పెట నిండితే ఒక ఒక "పన " అవుతుంది. అలాంటి కొన్ని "పనలు " ఒక కట్టగా కట్టి పొలంగట్లమీద ఆరబెడతారు. అవి ఒక వారం ఎండిన తరువాత కుప్ప వేస్తారు. అంటే గడ్డివామిలాగా అన్నమాట."

"ధాన్యం పదిరోజులు మాగాక, కొన్నాళ్ళతరువాత కుప్పనూరుస్తారన్నమాట. "చెప్పింది అమ్మమ్మ. అంటే ఆ చిన్న చిన్న కట్టలని బల్లలమీద గట్టిగా బట్టలు ఉతికినట్లుగా కొడతారు అప్పుడు ధాన్యం రాలిపోతుంది. తరువాత ఆ గడ్డిని గొడ్లతో తొక్కిస్తారు. ఇంకాఏమైనా మిగిలితే అదికూడా రాలుతుంది. అప్పుడు ధాన్యాన్ని తూర్పార బడతారు.అంటే చేటలతో పైనించి జల్లుగా రాలుస్తారు. తాలుగింజలు పక్కకు పోయి,అసలైన గింజలున్న ధాన్యం కుప్పగా పడుతుంది. దాన్ని బస్తాలలో నింపుతారు. చెప్పింది అమ్మమ్మ.

"ఓహో! కుప్పనూర్చటం అంటే పండినధాన్యాన్ని మొక్కలనుంచి రాలగొట్టి బస్తాల్లో వెయ్యటం అన్నమాట" అన్నాను. " అవునమ్మా చక్కగా అర్థం చేస్కున్నావ్" అంది అమ్మమ్మ.

సాయంత్రానికి సుబ్బడు అదరాబదరా వచ్చేడు. " అమ్మగారూ పంట ఈరోజే నూర్చేద్దాం .... కరణం గోర్ని నమ్మటానికి లేదు. ఒదెలమీదనే ఆయన ఇల్లుజేర్చుకున్నా మనమేం చేయలేం " అన్నాడు.

" ఇప్పటికిప్పుడంటే ఎలాగరా? మనుషులు కావద్దా? రేపుచూసుకుందాం" అంది అక్కయ్య. కానీ వాడు వినలేదు.

"ఎన్నెల రోజులే కదమ్మా ఏంతసేపూ అంటూ ..." అప్పుడే మనుషుల్నితెచ్చి కుప్ప నూర్చాడు. ఎండకుండానే నూర్చడం తో తక్కువ రాలింది పంట ఎకరానికి పదిబస్తాలే రాలింది. గట్టిగా ఉండి గింజ రాలక పోవటం తో ఓదెలు కుప్పవేసి అలాగే ఉంచేసాం. ధాన్యం ఇల్లు చేరింది గుట్టు చప్పుడుగా.

వాడి అనుమానం నిజమే అయ్యింది! మూడో రోజున కుప్పేసిన ఓదెలకు నిప్పంటుకుంది. అర్ధరాత్రి ఎవరో చూసి అయ్యో హనుమాయమ్మగారి పొలం లో కుప్ప తగలబడుతోందని ఊరంతా కదిలివచ్చి మంటలు ఆర్పేశారు. అందరూ దాన్ని ప్రమాదమని బైటకు అన్నా..... అదెలా జరిగిందో అందరికీ తెలుసు! అయినా ఎవ్వరూ నోరుతెరిచి వాడిపేరు చెప్పలేదు. సుబ్బడికి రెండుచేతులూ ఎత్తి దణ్ణం పెట్టుకున్నాం. నిజంగా భగవంతుడు వాడి రూపం లో మమ్మల్ని ఆదుకున్నాడని ఆనందించాం.

పంటలో కొంత  సుబ్బడికి ఇచ్చి మిగిలిన ధాన్యం పురికట్టేశాము. రాగులూ, సజ్జలు,  కొంత చేతికి వచ్చినయ్. జొన్న గొడ్లమేతకు ఉపయోగపడింది. కొంత కాలం గడిచింది కానీ అక్కయ్య కు గుంటూరు వెళ్ళాలని కోరిక. అక్కడ వాతావరణమూ, మనుషులూ , స్వతంత్రోద్యమం గురించిన సంభాషణలూ, కలకత్తాలోనూ, ఢిల్లీ, బొంబాయీ, మద్రాసూ లాంటి పట్టణాల్లో జరిగే మీటింగులూ, ప్రజా ఉద్యమాల విశేషాలు మాట్లాడుకుంటుంటే ఎంతో ఉత్సాహం అనిపించేది.

కానీ ఊరొదిలి పోతే ... ఆ పొలాలు ఏంచేస్తాడో అని భయం. ప్రస్తుతానికి పాడీ పంటా ఉంది. పెరట్లో కాసే ఆకుకూరలూ, కూరగాయలతో రోజులు బాగానే గడిచిపోతున్నాయ్. కానీ మా జాతకంలో అలా రాసిపెట్టి ఉందేమో ...ఆమాత్రం సుఖంగా, సంతోషం గా ఉండేయోగం మాకు లేదేమో ..... మా అంతమాత్రపు సంతోషానికే మా తమ్ముడు భరించలేక పోయాడు.

ఒకరోజు రాత్రిపూట దొంగలను పురమాయించి, ఇంటికి కన్నం వేయించాడు. ఆ చప్పుడుకిమెళకువ వచ్చి ఇద్దరం కేకలు పెడితే, ఊరివాళ్ళు లేచేసరికి దొంగలు పారిపోయారు. ఊరికి కాస్త ఎడంగా ఉన్న ఇల్లేమో ..... మేము ఉళ్ళోకి పరుగెత్తి మనుషులను పిలవాల్సివచ్చింది.

ఇక అక్కయ్యకు అక్కడ ఉండాలని అనిపించలేదు. " వద్దు  చిట్టెమ్మా ఇక ఇక్కడ మనం మొండిగా ఉండటం మంచిది కాదు. ఊరిలో రక్షణ లేనప్పుడు ఏ అఘాయిత్యమైనా జరిగితే తలెత్తుకోలేం. ఇక మనం గుంటూరు చేరాల్సిందే " అని పట్టుబట్టింది.దున్నపోతులూ, పాడిబర్రే సుబ్బడికిచ్చి, పొలం చూస్తుండమని చెప్పి, బండి కట్టించుకుని ఆ కాస్త ధాన్యంతో గుంటూరు చేరాం.

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments